# ఆవేశపడ్డ మహేశం

ఆదివారం ఏం ప్రోగ్రామా అని మహేశం, కృష్ణమూర్తి ఆలోచించి ఆలోచించి చివరకు సినిమాకి వెళ్దామని నిర్ణయించుకున్నారు. స్నేహితులిద్దరూ అయిదున్నరకే ముస్తాబయి హాలు దగ్గరికి చేరుకున్నారు. కృష్ణమూర్తే రూపాయిపావలా టిక్కెట్లు రెండు కొన్నాడు. హాల్లోకి వెళ్ళారు ముందుగానే.

హాల్లోకి వచ్చే జనాన్ని చూస్తూ కూర్చున్నారు ఇంకా టయిముండటం వల్ల. ఫస్టుబెల్లు కొట్టారు. సెకండుబెల్లు కూడా అయింది. హాల్లో ఒకటి రెండు చిన్నలైట్లు తప్ప తక్కినవన్నీ ఆరిపోయాయి. స్నేహితులిద్దరూ మెడలెత్తి చూస్తున్నారు అప్పర్ క్లాసుల్లోకి వచ్చే ప్రేక్షకుల్ని. చిలకాగోరింకల్లా వచ్చి యువదంపతులు బాక్సుల్లో కూర్చుంటున్నారు.

గుడ్డివెల్తుర్లో కూడా ఆ యువతుల దుస్తులు, నగలు తళతళ మంటు న్నాయి. వాళ్ళ రూపాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. వాళ్ళ దగ్గర్నుంచి వచ్చే అత్తరు వాసన చాలాదూరం వరకు గుబాళిస్తోంది. కృష్ణమూర్తి మెడదించి తెరవంక చూస్తూ పాట వింటున్నాడు.

ఒక జంట వచ్చి బాక్సులో కూర్చోవటం మహేశం కళ్ళబడింది. కళ్ళు నులుపుకుని తీవ్రంగా చూశాడు. యువతిని గుర్తుపట్టాడు. అతని ముఖం రంగు మారింది. కళ్ళు ఎర్రబడ్డాయి. గుండెల్లో ఎవరో పలుగు లతో పొడిచినట్లయింది. ఆమె తన చెల్లెలు రాధ అని పోల్చుకున్నాడు.

ఆట ప్రారంభమయ్యింది. దీపాలు ఆరిపోయాయి. కథ సాగిపో తోంది. పక్కనున్న కృష్ణమూర్తి దానిలో లీనమైపోయాడు. మధ్య మధ్య సంతోషం పట్టలేక మహేశం భుజంపట్టుకుని కుదుపుతున్నాడు. పెద్దగా నవ్వుతున్నాడు. మహేశంతో ఏమేమో చెబుతున్నాడు. మహేశం మాత్రం వేరే ఆలోచనలో పడ్డాడు. కళ్ళు అప్పగించి అర్థంలేకుండా సినిమా చూస్తున్నాడు. కృష్ణమూర్తికి ఏదో జవాబు చెబుతున్నాడు.

మహేశానికి తల తిరిగిపోతోంది ఆలోచన్లతో. 'చెల్లెలే ఆమె. అవును రాధే! రాధ సినిమాకు వచ్చింది. ఒక్కతే కాదు మరో స్నేహితు డితో. ఆ శుంఠ ఎవడో తెలియడంలేదు. పూల అఫ్‌శ్లాకు, ప్యాంటు వేశాడు. మొహం సరిగ్గా తెలియడంలేదు. చూడబోతే బాగా డబ్బున్నవాడల్లే వుంది. ఎంత అవమానం, ఎంత అప్రతిష్ఠ. ఛీ! ఇప్పుడే వెళ్ళి హాల్లోనే నాలుగు తన్ని యింటికి యీడ్చుకుపోతే దీనికి సిగ్గు వస్తుంది. ఎంత బరితెగించిపోయింది. ఉన్న వూళ్ళో ప్రియుడితో విహారాలా! నాన్నగారి పరువు, వంశం పరువు కాలబెట్టింది. ఇది నాన్నకు తెలిస్తే దీన్ని యిక్కడే కాల్చేస్తాడు. ఇంతకీ తప్పు నాన్నదే. స్కూలుఫైనలు ప్యాసవ గానే చదువు ఆపి పెళ్ళి చేయమని అమ్మ ఎంత బతిమాలింది. ఎన్ని విధాల నచ్చ చెప్పింది. ఎంతో ప్రార్థించింది. చిన్నప్పుడే అచ్చటా ముచ్చటా అన్నీ చూసుకోవచ్చు పెళ్ళి జరపమంది. నాన్న ఒప్పుకుంటేనా,

కథా నిలయం
844



సనేమిరా ఇప్పుడు చేయనన్నాడు. బి.ఎ. ప్యాసవ్వాలట రాధ. అవుతోందిగా యిప్పుడు. ఇంటర్మీడియేటన్నా పూర్తికాలేదు. అప్పుడే దీనికి షోకులు, ప్రణయం ముదిరిపోయాయి. నా చెల్లెలు ఇంత నీచంగా ప్రవర్తిస్తుందనుకోలేదు కలలో కూడా. నాకేమాత్రం తెలిసినా పేగులేరేసే వాణ్ని. ఇప్పుడు మటుకు మించిపోయిందేముంది. ఇంటికి రాగానే దీని అంతు తెలుసుకుంటా. నాన్నవరకు పోకముందే దీని కథ తేలిపోవాలి. నాన్నేమో పెద్ద కంపెనీకి మేనేజరుని గదా వెయ్యిరూపాయలు సంపాదిస్తున్నాగదా అమ్మాయి గ్రాడ్యుయేటు కాకముందు పెళ్ళి చేయడమా అని బిగుసుక్కూర్చున్నాడు. ఇదేమో తప్పుదార్లు పట్టి కుటుంబ ప్రతిష్ఠ మంటకలుపుతోంది. ఇప్పుడు మటుకు మించిపోయిందేముంది. ఇంటికి రాగానే గుమ్మంలోనే దీనికి ప్రాయశ్చిత్తం చేసి తీరుతా.'

మహేశం చాలా వుద్రేకంలో వున్నాడు సినిమా అర్థం కావడం లేదు. మధ్య మధ్య మెడెత్తి చూస్తున్నాడు చెల్లెలు కూర్చున్న బాక్సువేపు. మసకగా కన్పిస్తున్నారు ఇద్దరూ.

కృష్ణమూర్తి సినిమా సన్నివేశంతో కలిసిపోయి తెగనవ్వి, మహేశాన్ని ఒకటి చరచాడు కాలుమీద. మహేశం వూహాపథంలోంచి దిగి వచ్చినట్టు వింతగా చూశాడు కృష్ణమూర్తి వంక. మహేశం వాలకం చూసి ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి.

"అదేమిట్రా! అలా వున్నావ్. సినిమా బాగా లేదుట్రా. తలనొప్పిగా వుందా ఏవిరా?" అన్నాడు కృష్ణమూర్తి పరామర్శిస్తూ.

ఏం జవాబు చెప్పాలో తెలియలేదు మహేశానికి. "కొంచం తలనొప్పిగా వుందిరా. అది కాకుండా యీ ఫిల్ము యిదివరకు వచ్చినప్పుడు చూసిందేరా" అని జవాబు చెప్పాడు.

"నే మటుకు చూడలేదంటావురా యిది. ఎన్నిమార్లు చూస్తే మటుకేవిరా. ఆ మ్యూజిక్కు, ఆ యాక్షను, ఫోటోగ్రఫీ మార్వెలస్ కాదురా!" అన్నాడు సినిమాని మెచ్చుకుంటూ కృష్ణమూర్తి.

ఇంటర్వెల్ బెల్లు మ్రోగింది. స్నేహితులిద్దరూ బయటకు వెళ్ళారు. కూల్ డ్రింక్సు తాగి చల్లగాలి పీలుస్తూ అక్కడే నుంచున్నారు. తిరిగి బెల్లు గణగణమంది.

ఇద్దరూ లోపలికి వచ్చారు. తిరిగి సినిమా ప్రారంభమయింది. మహేశం సినిమా చూడలేక పోతున్నాడు. మహేశం ధోరణిచూసి కృష్ణమూర్తికి కూడా సినిమామీద ఇంటరెస్టు తగ్గింది. అలాగే కూర్చున్నారు.

ముళ్ళమీద కూర్చున్నట్టుగా వుంది మహేశానికి. తెగ కదుల్తున్నాడు కుర్చీలో. ఇది గ్రహించాడు కృష్ణమూర్తి.

"ఒరేయ్! మహేశం. పోదాం పదరా. తల నొప్పిగా వుంటే యిక్కడెందుకు. త్వరగా యింటికి జేరితే నాలుగు మెతుకులు తిని విశ్రాంతి తీసుకోవచ్చు. రేపు పొద్దున్న మళ్ళా కాలేజీ వుంది. తెల్లారగట్టే లేచి చదువుకోవచ్చు. బి.య్యే. యీ యేడు ముక్కేస్తే తర్వాత సంగతి చూసుకోవచ్చు....పదరా....కారు మా చెల్లె నిర్మల వేసుకుపోయిందిరా ఎక్కడికో. అంచుకే మనకి నడక.... పద రిక్షాలోనే పోదాం" అని కుర్చీలోనుంచి లేచాడు. వెనకాలే మహేశం వెళ్ళాడు.

రిక్షాలో ఇళ్ళకి చేరుకున్నారు.

మహేశం వెళ్ళగానే భోజనం చేయలేదు. వంటవాడు అన్నానికి రమన్నాడు. చెల్లి వచ్చాక తింటాను పొమ్మన్నాడు కోపంగా. మేడ మీదకు వెళ్ళకుండా కింద వరండాలోనే కూర్చున్నాడు. సినిమా వదిలే టయిమయింది.

రాధ మీద కోపంతో రౌద్రాకారంతో వున్నాడు. బూట్లుకూడా విప్పుకోలేదు.

ఇంతలో గేటుదగ్గర చిన్నకారు ఆగింది. ఫ్రంటు డోరు తీసుకుని రాధ దిగింది.

పక్కన స్టీరింగు దగ్గర కూర్చున్న వ్యక్తి "బై - బై రాధా!" అని కారు స్టార్టుచేయబోతుంటే "ఆగాగు. ఇప్పుడే వెళ్ళవుగాని ఒక్కసారి లోపలికిరా. ఇందాక రమ్మంటే సినిమా టయిమయిందని లోపలికి రాలేదు. కాఫీగాని, డ్రింకుగాని తాగి వెంటనే వెళ్ళవుగాని" అంది రాధ.

ఈ మాటలు విని మరీ మండిపోయాడు అది వింటున్న మహేశం. ఇద్దరి పని పట్టాలని నిశ్చయించుకున్నాడు. ఆ వసారాలోనే నిలదీసి ఇద్దరి పిచ్చిపిచ్చి వేషాలు అంతం చేయాలనుకున్నాడు.

ఆ కారువంక మంటలు కురిసే కళ్ళతో చూస్తున్నాడు.

రాధా, ఆ వ్యక్తీ చెయ్యీ చెయ్యీ కలుపుకుని లోపలికి వస్తున్నారు.

మహేశం కోపంతో మండిపోతూ లేచి నుంచున్నాడు.

ఆ యిద్దరూ వరండాలోకి వచ్చారు. ఇద్దర్నీ చూశాడు మహేశం.

తాను భూమిలోకి కుంగిపోయినట్టయింది మహేశానికి. కాళ్ళ కింద నేల బద్దలయి పెద్ద అఖాతంలోకి తాను పడిపోతున్నట్టుగా వుంది.

తిరిగి కుర్చీలో కూలబడ్డాడు మహేశం.

"ఇంకా అన్నం తినలేదా అన్నయ్యా.

ఇక్కడే కూర్చున్నావే?" అని ప్రశ్నించి చెల్లెలు రాధ వెళ్ళింట యింట్లోకి జవాబు రాకుండానే.

పూల ఫ్లాక్, ట్వీడ్ పాంట్ వేసుకుని బాబ్డ్ జుట్టుతోవున్న కృష్ణమూర్తి చెల్లెలు నిర్మల, మహేశం వంక ఓరగాచూసి తన వింత వేషానికి కొంచెం సిగ్గుపడి చిరునవ్వుతో రాధ వెనకాలే వెళ్ళింది.

మహేశం పెద్ద నిట్టూర్పు విడిచాడు. *

(1957)